# చిత్రమైన బోర్డు

"ఆడదానికి అంత అహం పనికిరాదమ్మాయ్! డెబ్బయ్యేళ్ళ జీవితం చూసినదాన్ని- తల పండిన అనుభవాలతో చెపుతున్నాను. నువ్వెంత చదువుకుని మగాడితో పాటు ఉద్యోగం చేస్తూ సంపాదిస్తున్నా, మగాడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని నువ్వూ మగాడితో పాటు రెచ్చిపోయి, జీవితాన్ని రోడ్డెక్కించి నవ్వులపాలుచేసుకోవడం గొప్పనుకుంటున్నావా? మొగుణ్ణి వీధిలోకి లాగి నువ్వు సాధించేదేమిటి? నువ్వే నా కూతురివైతే వ్యవహారం ఇంతవరకు రానిచ్చేదాన్ని కాదు. నువ్వు నాకేమవుతావని నేనింత బాధపడాలి? కేవలం నా ఇంట్లో అద్దెకుండేదానివి అని ఎంత అనుకున్నా, పెద్దదాన్ని కాబట్టి నువ్వు ఏట్లో దిగుతుంటే చూస్తూ ఊరుకోలేకపోతున్నాను. నీ మూలాన నా ఇల్లు ఒక సంత లాగా గుర్తించబడడం, అందరూ వింతగా నా ఇంటి వంక చూడడం నేను సహించలేనమ్మాయ్. ఇలా చెపుతున్నానని నువు కోపగించుకున్నా నేనేమీ చెయ్యలేను. నువ్వు వెంటనే మరొక ఇల్లు చూసుకోవడం మంచిది. ఆడపిల్లలకి చదువులూ, సంపాదనలూ, స్వేచ్ఛలూ వస్తే ఇలా కాక మరేమవుతుంది!..."



అర్థరాత్రి దాటుతున్నా, దోమల్లా ముసురుతున్న ఆలోచనలతో నిద్రపట్టక కొట్టుకుంటోన్న సులోచనకి సాయంత్రం ఇంటావిడ లలితాంబ ఇచ్చిన వార్నింగ్, ఆవిడ విసిరిన బాకుల్లాంటి విసుర్లూ చెవుల్లో గింగురమంటున్నాయి.

తను తప్పు చేసిందా? తన నిర్ణయం- తనుచేసిన పని నలుగురిలోనూ తనని నవ్వులపాలు చేస్తుందని తెలిసే చేసింది. ప్రపంచంలో ఏ ఆడదీ ఇంతవరకూ ఎక్కడా చేయని పని తను చేసింది. ఆ పని చేసే వరకు తను అంతకి తెగించగలదని తనకే తెలియదు. దెబ్బతిన్న మనసుకి ధైర్యం, తెగింపు వాటికవే వస్తాయేమో. సుధీర్‌తో నాలుగేళ్ళ వైవాహిక జీవితం తనని అటువంటి అనూహ్యమైన నిర్ణయం తీసుకునేలా చేసింది. తను చేసిన పని వల్ల ఇప్పటికే తను తెలుసున్నవాళ్ళూ, తన ఇంటి రోడ్డున వెళ్ళేవాళ్ళూ తను చేసిన పని (లలితాంబ మాటల్లో 'నిర్వాకం!') గురించి వింతగా, విడ్డూరంగా చెప్పుకుంటున్నారు. మంచో, చెడ్డో- తను రోటిలో తల పెట్టింది. ఇంక రోకటి పోటుకి భయపడడం అనవసరం. జరగబోయేది జరగనీ- అని మనసుని సమాధానపరచుకుని నిద్రలోకి జారుకుంది.

బారెడు ప్రొద్దెక్కిన తర్వాత కిటికీలోంచి మీద పరుచుకుంటున్న ఎండకి ఉలిక్కిపడి లేచింది. ఆ రోజు ఆదివారం అని గుర్తుకు రావడంతో రిలాక్స్ అయింది. ఒక్కర్తీ కాఫీ కలుపుకుని తాగుతూ- సుధీర్ లేకపోవడంతో ఎంత హాయిగా, స్వేచ్ఛగా వుంది! అనుకుంది. పెళ్ళితో మగాడికి మరొక వ్యక్తి మీద అధికారం, అదుపు దొరికి లేని గొప్పతనాన్ని ఫీలయితే- అదే పెళ్ళితో ఆడది స్వేచ్ఛ పోగొట్టుకుని తనని తాను కుంచింపచేసుకుంటుందేమో. జత కట్టిన తరువాత స్వేచ్ఛను కోల్పోయే ఆడప్రాణి సృష్టిలో స్త్రీ మాత్రమేనేమో! సుధీర్ ఇంట్లో లేకపోవడంతో తనకి కోల్పోయిన స్వేచ్ఛ తిరిగి వచ్చినట్లయింది. వారం క్రితం తను ఆ బోర్డు రాయించి గేటుకి కట్టాక తనతో ఘర్షణపడి వెళ్ళిపోయిన సుధీర్ ఇంకా ఇంటి ముఖం చూడలేదు. తను ఆ బోర్డు తీసేస్తేనే గాని అతను రాడు. అతను మారితేనే గాని తను ఆ బోర్డు తియ్యదు! ఈ పూట తనకి ఇష్టమైనవన్నీ చేసుకుని తినాలి. ముందు ఉతకాల్సిన చీరల సంగతి చూడాలి అనుకుంటూ పెరట్లోకి నడిచింది.

"అమ్మాయ్ సులోచనా! నీ కోసం ఎవరో ప్రెస్సోళ్ళంట వచ్చారు. తలుపు తియ్" అని లలితాంబ గొంతు గట్టిగా వినిపించడంతో సబ్బు చేతులు తుడుచుకువచ్చి తలుపు తీసింది. ఎవరో ఇద్దరు ఆగంతుకులు తమని 'యోచన' పత్రిక విలేకరులమని పరిచయం చేసుకున్నారు. ఇంటి గేటుకి తగిలించిన బోర్డు గురించి తెలిసి అభ్యంతరం లేకపోతే ఇంటర్వ్యూ చేసి పత్రికలో వెయ్యటానికి వచ్చామని పొలైట్‌గా చెప్పారు. అభ్యంతరం చెప్పాల్సిన అవసరం ఏమీ కనిపించక డ్రాయింగ్ రూంలో కూర్చోపెట్టి కిచెన్‌లోకి వెళ్ళి రెండు కాఫీకప్పులతో వచ్చింది.

"మీ గురించి తెలుసుకోవచ్చా మేడమ్...?" కాఫీ సిప్ చేస్తూ టేప్‌రికార్డర్ ఆన్ చేసి అడిగాడు.

"వెల్. నా పేరు సులోచన. ఎమ్మే లిటరేచర్. ఏమెస్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్".

"మీ గేటుకి తగిలించిన బోర్డు చూస్తాం. సాధారణంగా కొన్ని ఇళ్ళ గేట్లకి 'కుక్క వుంది- జాగ్రత్త' అనే బోర్డు చూస్తాం. కాని మీరు తగిలించిన బోర్డు చాలా సెన్సేషనల్‌గా వుంది. ఆ బోర్డుకి అర్థమేమిటో, అది ఎందుకు తగిలించారో తెలుసుకోవాలని కుతూహలం కలగడం సహజమేమీ కాదనుకుంటాను..."

"కుక్క విశ్వాసపాత్రమైన జంతువు. తనకి అన్నం పెట్టే యజమాని ఇంటిని విశ్వాసంగా కాపలా కాస్తుంది. కొత్తవాళ్ళనీ, ప్రమాదకరంగా కనిపించే వ్యక్తుల్ని ఎవర్నీ లోపలకి రానీయదు., ఒక రకంగా మనిషి సాటి మనిషిని నమ్మడం కన్నా కుక్కని నమ్మడమే మేలనిపిస్తుంది. 'కుక్క వుంది- జాగ్రత్త' అనే బోర్డు చూసి ఇంటికి వచ్చేవాళ్ళు జాగ్రత్త పడతారు.

ఆ బోర్డు లేకపోతే ఇంటికి వచ్చే వాళ్ళకి ప్రమాదం. నా ఉద్యోగ రీత్యా సమాజంలో నాకో స్టేటస్ వుంది, గౌరవం వుంది. నా అవసరం వుండి, ఉద్యోగాలు చేసుకుంటూ చదువుకునే ఆడవాళ్ళు, కాలేజీ ఆడపిల్లలూ నిత్యం నా ఇంటి కొస్తూంటారు. నా కోసం నా ఇంటికి వచ్చే ఆడవాళ్ళకి ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో ఆ బోర్డు పెట్టాను"

"ఎవరి వల్ల ప్రమాదం జరగకూడదని...?"

"నా మొగుడి వల్ల..."

"అంటే... కొంచెం వివరిస్తారా?"

"వెల్. నా భర్త కూడ పోస్ట్ గ్రాడ్యుయేట్. బ్యాంక్ ఆఫీసర్. సంప్రదాయ బద్ధంగా పెద్దలు కుదిర్చే, కట్న కానుకలతో జరిగే వివాహాల పట్ల నాకు ఏవగింపు. అందుకని తగిన వరుడి కోసం పేపరు ప్రకటన ఇచ్చి, వచ్చిన వాళ్ళలో ఈయనంటే నచ్చి పెళ్ళిచేసుకున్నాను"

"నచ్చి అంటే...?"

"మంచి చదువు, మంచి జాబ్, అందమైన పెర్సనాలిటీ- తగిన జోడీ అనిపించింది"

"మరి ఆయనతో మీ కొచ్చిన ఇబ్బందేమిటి...?"

"అతను మేడిపండు! పైకి కనిపించే అందమైన రూపం వెనుక అసహ్యకరమైన అంతరంగం. అతనికి ఆడపిచ్చి. కంటికి కాస్త నదరుగా కనపడ్డ ఆడదానికల్లా గాలం వేస్తాడు. మంచీ- చెడ్డా, వైవాహిక జీవితపు కట్టుబాట్లు వంటి ఏ విలువల మీదా గౌరవం లేని మనిషి. అతని బుద్ధి తెలిసి కొత్తలో బాధపడ్డాను. నచ్చచెప్పాను. బెదిరించాను. పోట్లాడాను, అసహ్యించుకున్నాను. ఏమీ లాభం లేదు. పుట్టుకతో పుట్టిన బుద్ధి పుడకలతో గాని పోదు.

తన మేధస్సునంతా కుతర్కానికి ఉపయోగిస్తాడు.

'నేను ఏ ఆడదాన్నీ వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా రేప్ చెయ్యడంలేదే'- అంటాడు. 'చెరువుగట్టుకి వెళ్ళి గాలం వేసి కూర్చుంటాం. చేపలు పడితే ఇంటికి తెచ్చుకుని భోంచేస్తాం. ఎరకి ఆశతో వలలో చిక్కడం చేప తప్పే కాని గాలం వేసేవాడి తప్పు కాదుగా. నా వలలో పడ్డవాళ్ళని ఎంజాయ్ చేస్తాను. కావాలని ఎవరినీ మోసం చెయ్యనే. పెళ్ళయి పెళ్ళాం వున్నవాడినని తెలిసి కూడా నా వలలో పడితే అది నా తప్పా? పూల తోటలో ఒకే తుమ్మెద అనేక వందల పువ్వులపై వాలి తేనె పీల్చడం లేదా? రోజూ ఒకే కూర వండితే తినడం ఎలా బోరో- రోజూ ఒకే ఆడదానితో ఇదవడం అంతే బోర్. నాలుక షడ్రుచులూ కావాలనుకోవడం ఎంత సహజమో అలాగే ఈ విషయంలోనూ రకరకాల రుచులు ఆశించడంలో తప్పేమిటి? జీవితం ఆనందించడానికేగా...' అంటూ కుతర్కం లేవదీయడంలో దిట్ట.

జంతువులన్నిటికీ మేటింగ్ సీజన్స్ వున్నాయి. జాతి పునరుత్పత్తి కోసమే అవి సృష్టి కార్యంలో పాల్గొంటాయి. సమయం- సందర్భం, సహజం, అసహజం అంటూ లేక ఎప్పుడు పడితే అప్పుడు సెక్స్‌లో పాల్గొనే ఏకైక జంతువు మనిషే! మంచీ-చెడ్డా, పాపం-పుణ్యం, వావి-వరస వంటి వాటి గురించి ఆలోచించగలిగే మానసిక పరిణితి కలిగి వుండి కూడా వాటి గురించి ఆలోచించని జంతువు కూడా మనిషే

నా మొగుడూ అటువంటి జంతువే. స్వంత తల్లీ, చెల్లీ కాకపోతే ఏ ఆడదాన్నయినా పక్కలోకి లాక్కోవడానికి వెయ్యని ఎత్తులు లేవు. ఆడదాని వంపు సొంపుల వంక, రొమ్ముల వంక, చివరకి వంటి నిండా చీర కప్పుకున్నా నగ్నంగా కనిపించే పాదాలని సైతం వదలక- రోజుల తరబడి అన్నం ఎరగని బిచ్చగాడిలా ఆశగా, ఆబగా చూసే మగపురుగుల కంటే- నోటపడ్డ జీవాన్ని కరకర నమిలి మింగే మొసళ్ళు చాలా నయం."

"ఇటువంటి వక్రకామానుభూతుల మనస్థత్వాలు ఎలా ఏర్పడతాయని మీరు భావిస్తున్నారు మేడమ్?"

"పురుషాధిక్య సమాజపు వికృత ర్పూపపు పరిణామం అది. స్త్రీని ప్లెజరబుల్ థింగ్‌గా, వ్యాపార వస్తువుగా చూపెట్టే సినిమాలు, అందాల పోటీలు, టీవీలు, పత్రికలు, ప్రచార సాధనాల వక్ర విధానాల ఉమ్మడి ఫలితం ఇది. రోడ్డు మీద ఆడది పోతూంటే- చేతలతో కుదరదు కాబట్టి కళ్ళతోనే అనుభవించేసే జుగుప్సాకరమైన వికృత మనోవికారాలకి లోనవుతున్నారంటే- పిల్లల పెంపకాలలో, విద్యాబోధనలో నైతిక విలువల బోధనని పూర్తిగా నిర్లక్ష్యం చెయ్యడం మరొక కారణం."

"ఈ ఊబిలోంచి మీ ఆయన్ని ఎలా సంస్కరించదలచుకున్నారు? మీ బోర్డు వల్ల ఆయన మారతారా? అసలు అటువంటి బోర్డు పెట్టాలనే ఆలోచన మీకెలా వచ్చింది? దాని ఫలితాలు ఎలా వుంటాయని భావిస్తున్నారు?"

"అలా ఆ బోర్డు తగిలించినంత మాత్రాన ఆయన మారిపోతాడని నేననుకోవడం లేదు. నేనిచ్చింది ఒక షాక్ ట్రీట్‌మెంట్. దాని వల్ల మారనూ వచ్చు- వికటించి రెచ్చిపోనూవచ్చు. ఆయన మారడానికి ఇంకే పద్ధతులూ పని చేయకే ఆ పని చేసాను. సర్వ శక్తులూ కూడగట్టి గెలవడానికి ప్రయత్నించినా, ఓటమి ఎదురైనపుడు కలిగే నిరాశా, నిస్పృహలతో హఠాత్తుగా ఊహించలేని పని చెయ్యడం అరుదైనా అసంభవం కాదు. చాలా ఏళ్ళ క్రితం మద్రాసు మహానగరం నడిబొడ్డున సంప్రదాయ కుటుంబంలోంచి వచ్చిన పద్దెనిమిదేళ్ళ కాలేజి ఆడపిల్ల వున్నట్టుండి వివస్త్ర అయి పరిగెత్తడం మొదలుపెట్టింది. సైకియాట్రిక్ ఎగ్జామినేషన్‌లో ఆ పిల్లకి ఎటువంటి మెంటల్ అబ్నార్మాలిటీ లేదనీ, చాలా తెలివైన పిల్ల అనీ తేలింది. ఎందుకిలా చేసినట్టు? జీవితంలో తనకో వ్యక్తిత్వం, గుర్తింపు, కాస్త స్వేచ్ఛ పొందడానికి చేసే ప్రయత్నాలను అణచి వెయ్యడంతో పేరుకుపోయిన ఫ్రస్ట్రేషన్‌తో అలా రియాక్టయి అటువంటి అబ్నార్మల్ బిహేవియర్‌కి దారి తీసిందని తెలిసింది.

గేటుకి తగిలించిన బోర్డు చూడగానే అరికాలి మంట నెత్తికెక్కి- మగాడు కదా! నా చెంప పగలగొట్టాడు. నేను చేసిన పని వల్ల అతని పేరుతో బాటు నా పేరూ జుగుప్సాకరమైన ప్రచారానికి లోనవుతుందనీ, మా వైవాహిక బంధానికి ముప్పు తప్పదని తెలిసే ఈ పని చేసాను. అతను నాకు విడాకులిచ్చి మరో పెళ్ళి చేసుకోడానికి ప్రయత్నించవచ్చు. అతని సంగతి తెలియని ఏ ఆడదైనా నాలాగే మోసపోవచ్చు. అలా ఏ ఆడదీ మోసపోకుండా చెయ్యడమే ఆ బోర్డు పెట్టడంలో నా ఉద్దేశం"

"దాని వల్ల అతనికి నష్టమంటారా?"

"వండుకునేవాడికి ఒకటే కూర- అడుక్కునేవాడికి అరవై కూరలన్నట్టు అతనికి నష్టం లేకపోవచ్చు. ఈ బోర్డు సంగతి తెలిసిన తర్వాత అతనికి మళ్ళీ పెళ్ళి కావడం కష్టం కావచ్చు. అటువంటి వ్యక్తుల గురించి బయటి ప్రపంచానికి చెప్పడం వల్ల నాకు వ్యక్తిగతంగా నష్టమే గానీ లాభం ఏమీ లేదు. కానీ అటువంటి మగవాళ్ళ మేల్ ఈగో మీద చావుదెబ్బ కొట్టి సభ్య సమాజంలో మనుషులుగా వాళ్ళ పరిమితుల్ని గుర్తుచెయ్యటానికి నేను చేసిన పని కొంతైనా పని చేస్తుందనుకుంటున్నాను."

"మీ బోర్డు చూసిన ప్రజల రియాక్షన్ ఎట్లా వుందో గమనించే వుంటారు. దానిపై మీ అభిప్రాయం చెపుతారా?"

"నేను చేసిన పనిని బయటివాళ్ళే కాదు. నా కుటుంబ సభ్యులు సైతం అంగీకరించలేరు. నలుగురూ నడిచే దారి ఎంత అసహ్యంగా వున్నా సరే- దానికి భిన్నంగా నడిస్తే వింతగా, కోపంగా, వెలివేసినట్టు చూస్తారు. నా విషయంలోనూ అంతే. నిన్నటివరకూ అందరికీ ఎంతో గౌరవనీయురాలనైన నేను ఇప్పుడు అందరికీ లాఫింగ్ స్టాక్ అయ్యాను. నా బోర్డు చూడడానికి పని గట్టుకుని మగాళ్ళు ఈ వీధిలో మసలడం చూసాను. వున్న వ్యవస్థని ఎదిరించి కొత్త విలువల కోసం పోరాడేటపుడు ఎదురుదాడి, దెబ్బలు తప్పవని తెలుసు. అలా అని ఇంత చదువుకునీ పిరికితనంతో అన్యాయాన్నీ, అసహ్యాన్నీ భరిస్తూ బ్రతకడాన్ని సహించలేను. వ్యవస్థతో పోరాడే వాళ్ళని లోకం ఎన్నడూ క్షమించదు. అయినా వాళ్ళ పోరాట ఫలితాలని తరువాత తరాలు అనుభవిస్తున్నాయి. నా పోరాటం మంచో-చెడ్డో కాలమే నిర్ణయిస్తుంది."

"సంప్రదాయ వివాహ పద్ధతుల్ని కాదని మీరు స్వతంత్రించి చేసుకున్న పెళ్ళి విఫలమయిందిగా. పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళే మంచివనిపించడంలేదా మేడమ్?"

"ఇదే వరుణ్ణి పెద్దలే కుదిర్చి చేసి వున్నా- జరిగేది ఇదేగా. పెళ్ళిళ్ళ సక్సెస్ పెళ్ళి జరిగే పద్ధతి మీద ఆధారపడి వుండదు. వివాహ వ్యవస్థ పట్ల, దంపతుల నైతిక విలువల పట్ల నమ్మకం, గౌరవం లేని వ్యక్తులతో పెళ్ళి- అది సంప్రదాయబద్ధంగా జరిగినా లేక స్వంత నిర్ణయం మీద జరిగినా ఫెయిలయి తీరుతుంది. నేను స్వతంత్రించి పెళ్ళి చేసుకోవడం తప్పనుకోవడం లేదు.

"మీ భవిష్యత్ కార్యక్రమం...?"

"ఆడవాళ్ళకీ-మగాళ్ళకీ వేరు వేరు నైతిక విలువలు పాటించబడడం మానేవరకూ నా పోరాటం ఆపను. ఈ పోరాటంలో నేనొక్కర్తినే సైనికురాలినైనా వెనుదియ్యను. గెలుపు ఓటములు ముఖ్యం కాదు. పోరాట స్ఫూర్తే ముఖ్యం."

"స్త్రీ పురుషుల సమాన విలువల కోసం నిలబడే మా పత్రిక మీకు నైతికపరమైన మద్దతు నిస్తుంది మేడమ్" అంటూ రిపోర్టర్లు లేచారు. వాళ్ళని గేటు వరకు సాగనంపడానికి సులోచన కూడా లేచింది.

ఆ రోడ్డు మీద కొత్తగా వెళ్ళేవాళ్ళో, లేక మొదటిసారి చూసేవాళ్ళో కాబోలు- ఆ గేటు మీద కొట్టవచ్చినట్టు కనబడుతూన్న "మగాడున్నాడు-జాగ్రత్త" అనే ఎర్ర అక్షరాల బోర్డు వంక ఆగి మరీ చూస్తున్నారు. సులోచన తన పనులయ్యాక కొత్త ఇంటి వేటకి బయలుదేరింది.